సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు



రాత్రి పెద్దశేష వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు



సూర్యప్రభ వాహనంపై శ్రీవారి విహారం

కడప (కల్చరల్), ఫిబ్రవరి 11: దేవుని కడపలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం ఉదయం 9గంటలకు దేవేరులతో కలిసి శ్రీవారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి వాహనానికి ముందు కళాకారుల చెక్కభజన, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రికి శ్రీవారు పెద్దశేష వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. మాడవీధుల వెంట మేళతాళాలు, మంగళవాయిద్యాలతో తిరుమలేశుడు సాగుతుండగా భక్తులు మిక్కిలి భక్తిపారవశ్యంతో స్వామిని చూసి తరించారు. అంతకు ముందు స్వామివారికి అభిషేకాలు అత్యంత భక్తితో నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు ఊంజల్ సేవ, రాత్రికి అన్నమాచార్య కీర్తనలు, హరికథాగానం భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయ అర్చకులు ఎం.క్రిష్ణమోహన్, త్రివిక్రమ్ సారథ్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకారం, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టరు ఈశ్వర్‌రెడ్డి, సిబ్బంది, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం శ్రీవారు చిన్నశేష వాహనంపై, రాత్రి సింహ వాహనంపై ఊరేగనున్నారు.

పులివెందులలో అంబేడ్కర్‌కు అవమానం

● ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి


కడప, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బాబాసాబ్ అంబేడ్కర్ ఆశయాలను సాధిస్తున్నామని చెప్పుకుంటున్న సీఎం వైఎస్ జగన్ ఆయన సొంతూరు పులివెందుల లోనే అంబేడ్కర్‌కు అవమానం జరిగే విధంగా వ్యవహరించాడని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఆరోపించారు. పులివెందులలోని పాతబస్టాండు వద్ద వైఎస్ విగ్రహం కాళ్ల కింద అంబేడ్కర్ విగ్రహం పెట్టి అవమానించడం దుర్మార్గమన్నారు. ఇది అధికారుల దురహంకారానికి పరాకాష్ట అన్నారు. పులివెందుల చుట్టుపక్కల ఇప్పటికే 15 వైఎస్ విగ్రహాలు ఉన్నాయని, ఇప్పటికే కోట్ల రూపాయలు వెచ్చించి సుందరీకరణ పనులు చేస్తున్నారని అన్నారు. పాత బస్టాండు వద్ద రూ.8 కోట్ల వ్యయంతో వైఎస్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇప్పటికే మూడుసార్లు తీసేసి ఆధునికీకరణ పేరుతో నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఇక్కడ వైఎస్ కాళ్ల కింద బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం పెట్టడం ఆయనకు అవమానమన్నారు. దీన్ని బట్టిచూస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అంబేడ్కర్‌పై ఉన్న గౌరవం ఏందో తెలిసిపోతుందన్నారు. ఈ విషయంపై సోమవారం కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి అక్కడున్న విగ్రహం తీయకపోతే నిరసన చేస్తామన్నారు. జగన్‌కు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా దీనికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక వీడియో విడుదల చేశారు.

ఈ విషయానికి సంబంధించి సంబంధిత అధికారిని వివరణ కోరగా.. పాతబస్టాండ్ వద్ద వైఎస్ విగ్రహం ఏర్పాటు చేశామని, అక్కడికి సమీపంలో గరండాల బ్రిడ్జి వద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. అక్కడ విగ్రహం ఏర్పాటుకు సంబంధించిన దిమ్మె పనులు జరుగుతున్నాయన్నారు. దీంతో అంబేడ్కర్ విగ్రహాన్ని వైఎస్ సర్కిల్‌లో ఉంచామన్నారు.



పులివెందుల పాత బస్టాండులో వైఎస్ కాళ్ల వద్ద అంబేడ్కర్ విగ్రహం

పొరుగు మద్యం సిద్ధం



● జిల్లాలో పొంగి పొర్లుతున్న వైనం
● హైదరాబాదు, హర్యానా, గోవా, కర్ణాటక నుంచి దిగుమతి
● వివిధ మార్గాల్లో రవాణా
● పులివెందులలో స్టాక్ పాయింట్లు
● తెర వెనుక వైసీపీ నేతలు

ఎన్నికలు రాకముందే జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. ప్రభుత్వ వైన్ షాపుల నుంచి మద్యం తరలిస్తే ఆడిటింగ్‌లో దొరికిపోతామని అనుకున్నారేమో.. పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా జిల్లాకు చేరవేస్తున్నారు. ఇటీవల పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఈ మద్యం పట్టుబడుతోంది. ఏ ఎన్నికలు జరిగినా డబ్బుతో పాటు మద్యం కూడా ఓటర్లను ప్రభావితం చేస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న ఎన్నికలకు ఇప్పటినుంచే అధికార పార్టీ నేతలు గోవా, కర్ణాటక, తెలంగాణ, హర్యానా మద్యాన్ని 'సిద్ధం' చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పొరుగు రాష్ట్రాల నుంచి తెస్తున్న మద్యాన్ని పులివెందుల నియోజకవర్గంలో నిల్వ చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది.

(కడప-ఆంధ్రజ్యోతి): అక్రమ సంపాదనకు అలవాటు పడ్డ కొందరు వైసీపీ నేతలు అడ్డదారులు వెదుక్కుంటున్నారు. ఇసుక, గ్రావెల్, భూములను కొందరు చెరబడితే మరికొందరు అక్రమ మద్యం వ్యాపారాన్ని ఆదాయవనరుగా మార్చుకున్నారు. జగన్ సర్కారు అమ్ముతున్న మద్యంపట్ల మందుబాబులు విముఖతగా ఉన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి తాగుతున్న బ్రాండ్లు లేకపోవడంతో ఇష్టమైన బ్రాండ్లకు గిరాకీ ఉంది. దీన్నే ఆసరాగా చేసుకుని వైసీపీ నేతలు పొరుగు రాష్ట్రాల నుంచి మద్యాన్ని జిల్లాకు పొంగి పారిస్తున్నట్లు చెబుతున్నారు. జిల్లాలో ఇటీవల వరుసగా లక్షలాది రూపాయల విలువ చేసే మద్యం పట్టుబడింది. కేస్‌లు కేస్‌లు పొరుగు రాష్ట్రాల మద్యం సీఎం సొంత జిల్లాలో చిక్కడం హాట్‌టాపిక్‌గా మారింది. ప్రధానంగా పులివెందులకు చెందిన కొందరు వైసీపీ నేతలు ఈ వ్యవహారానికి శ్రీకారం చుట్టారని ప్రచారం జరుగుతోంది. పొరుగు రాష్ట్రాల నుంచి పెద్దపెద్ద వాహనాల్లో లక్షలు విలువ చేసే మద్యం అరటికాయలు, కూరగాయలు, సరుకుల మాటున సరఫరా అవుతుండడం గమనార్హం.

ఇతర రాష్ట్రాల నుంచి కడపకు..

జిల్లాలో కర్ణాటక, గోవా, హర్యానా, తెలంగాణ బ్రాండెడ్ మద్యం ఇబ్బడిముబ్బడిగా దొరుకుతుందని అంటున్నారు. గత ప్రభుత్వ హయంలో దేశంలో ఉన్న అన్ని బ్రాండ్ల మద్యం ఇక్కడా దొరికేది. అప్పట్లో ధరలు కూడా తక్కువగానే ఉండేవి. ఎవరికి కావాల్సిన బ్రాండ్ వారు కొనుక్కునేవారు. అయితే జగన్ సీఎం అయ్యాక నూతన మద్యం పాలసీ పేరిట ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహిస్తూ వస్తోంది. గతంలో ఉన్న బ్రాండ్లన్నీ మాయమయ్యాయి. మద్యంషాపుల్లో వారు ఇచ్చింది, అమ్మిన మందే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బార్‌లలో అవసరమైన బ్రాండ్లు కొన్ని ఉన్నా క్వార్టర్‌పై రూ.80 నుంచి రూ.వంద అదనంగా అమ్ముతున్నారు. జిల్లాలో బ్రాండెడ్ మద్యానికి డిమాండ్ ఉండడంతో దాన్ని సొమ్ము చేసుకునేందుకు కర్ణాటక, తెలంగాణ, గోవా నుంచి పెద్దఎత్తున మద్యం దిగుమతి చేసుకుంటున్నారు. ఇటీవల ఆ రాష్ట్రాల నుంచి వచ్చే మద్యం జిల్లాలో ఏరులై పారుతోంది. ఎస్‌ఈబీ అరకొరగా దాడులు చేసినప్పటికీ సరఫరా అయ్యే మందు కన్నా దొరికేది చాలా తక్కువ అని చెబుతారు. ఇటీవల హర్యానా మద్యం కూడా జిల్లాకు వచ్చింది. జనవరి నుంచి ఇప్పటి వరకు కేవలం 42 రోజుల వ్యవధిలోనే భారీ ఎత్తున మద్యం పట్టుబడడం చూస్తే లిక్కర్ మాఫియా ఏ విధంగా పేట్రేగిపోతుందో అర్థమవుతుంది.

అరటికాయలు, కూరగాయల మాటున..

అరటికాయల మాటున పులివెందులకు తరలిస్తున్న రూ.5.50 లక్షల విలువ చేసే హర్యానా మద్యాన్ని రెండురోజుల క్రితం పోలీసులు పట్టుకున్నారు. బొలెరో, ఐచర్ వాహనాల్లో అరటికాయల బాక్సుల్లో పెట్టి హర్యానా రాష్ట్రానికి చెందిన 390 ఫుల్‌బాటిల్స్, 595 క్వార్టర్ బాటిల్స్ పులివెందులకు తీసుకువస్తుండగా పోలీసులు తనిఖీల్లో భాగంగా పట్టుకున్నారు. అయితే దాడుల్లో పెద్ద ఎత్తున మద్యం దొరికితే, కొంతమాత్రమే చూపించారనే విమర్శ ఉంది. జనవరి 30న ప్రొద్దుటూరులో కూరగాయల మాటున వ్యానులో తరలిస్తున్న రూ12.82లక్షల విలువ చేసే గోవా మద్యాన్ని ఎస్‌ఈబీ అధికారులు పట్టుకున్నారు. అదే నెల 14న ప్రొద్దుటూరు మండలం చిన్నశెట్టిపల్లె క్రాస్ వద్ద కారులో అక్రమంగా తరలిస్తున్న 160 బాటిళ్లను సీజ్ చేశారు. కడప నగరం దేవునికడప ఆర్చి వద్ద బైపాస్‌రోడ్డులో పుదుచ్చేరికి చెందిన 310 మద్యం బాటిళ్లను చిన్నచౌకు పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 2న చెన్నూరు పార్కువీధిలో 25 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు.

ఎన్నికల వేళ

జిల్లాకు కర్ణాటక, గోవా, తెలంగాణ, హర్యానా, పుదుచ్చేరికి చెందిన మద్యం పెద్ద ఎత్తున వస్తోంది. కొందరు అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కితే.. మరికొందరు వైసీపీ నేతలు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇతర రాష్ట్రాల నుంచి మద్యాన్ని తెచ్చుకుని సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. పులివెందుల, ప్రొద్దుటూరులో కొందరు వైసీపీ నేతలు ఈ తరహా వ్యవహారానికి తెరలేపారనే విమర్శ ఉంది. ఇ క పులివెందుల, కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు ఇలా ప్రధాన పట్టణాల్లో ఏపీ మందు కన్నా పొరుగు రాష్ట్రాల మందే బాగా దొరుకుతున్నట్లు చెబుతున్నారు. ఫోను కొడితే.. నేరుగా డోర్ డెలివరీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక వచ్చే ఎన్నికలు టీడీపీ, వైసీపీకి ప్రతిష్ఠాత్మకంగా మారాయి. వైసీపీ గెలిచేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలన్నీ వాడుకోవాలని చూస్తోందని అంటున్నారు. ఎన్నికల్లో ఓటుకు నోటుతో పాటు మద్యం కూడా ప్రభావం చూపుతుంది. నోటిఫికేషన్ వస్తే ఈసీ నిబంధనల ప్రకారమే లిక్కర్ విక్రయాలు చేయాల్సి ఉంటుంది. దీంతో ముందుగానే పొరుగు రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున మద్యం తెచ్చుకుని డంప్ చేసుకునే పనిలో ఉ న్నా ం ని తెలుస్తోంది.



రెండు రోజుల క్రితం పులివెందుల పోలీసులు స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం

ముగిసిన లూర్దుమాత తిరుణాల

కడప (కల్చరల్), ఫిబ్రవరి 11: కడప నగరం మరియాపురంలో లూర్దుమాత తిరుణాల ఆదివారం ఘనంగా ముగిసింది. లూర్దుమాత తిరుణాల సందర్భంగా నవదిన ప్రార్థనలు కన్నులపండువగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు మరియాపురం చర్చి ఆవరణలో జరుగుతున్న ఉత్సవాలకు చేరుకున్నారు. పెద్దఎత్తున విశ్వాసులు లూర్దుమాతను సందర్శించి కొబ్బరికాయలు, పండ్లు, పూలు కానుకలుగా సమర్పించారు. చివరి రోజైన ఆదివారం వేలాదిగా లూర్దుమాతను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అపోస్థలిక పీఠాధిపతి గాలిబాలి మాట్లాడుతూ పాపలను క్షమించే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకుని మరియ మాత పట్ల భక్తులు విశ్వాసంతో మెలగాలని సూచించారు. తిరుణాల మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన సమష్టి దివ్య బలిపూజ నిర్వహించారు. కాగా.. లూర్దుమాత తిరుణాల మహోత్సవాల్లో భాగంగా చివరి రోజున వృషభ రాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. అలాగే వాలీబాల్ పోటీలు కూడా నిర్వహించారు.



ప్రసంగిస్తున్న గాలి బాలి




ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం


కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 11: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5వరకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు సంబంధించి కడప ఆర్ఐవో కార్యాలయంలో కాల్‌సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐవో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ తొలిరోజు 55పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయని, ఈ పరీక్షలు సజావుగా జరిగాయన్నారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్ పరీక్షలకు 2232 మందికి గాను 2149మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్ పరీక్షలకు 1473మంది హాజరు కావాల్సి ఉండగా 1424మంది హాజరయ్యారన్నారు.


చనిపోయినా.. జాబితాలోనే..!

● ఊరిలో లేని వారికీ ఓట్లు
● తప్పులతడకగా ఓటర్ల తుదిజాబితా




ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు తొలగించని దృశ్యం





స్థానికంగా లేకున్నా ఓటరు జాబితాలో..



బద్వేలు, ఫిబ్రవరి 11: తప్పులకు తావులేకుండా, ఆరోపణలకు అవకాశం లేకుండా ఓటర్ల జాబితా రూపొందిస్తామని పదేపదే కలెక్టర్ నుంచి చీఫ్ ఎలక్షన్ కమిషన్ వరకు చెబుతూనే ఉన్నారు. అందుకు తగ్గట్లుగా కసరత్తు చేసి తుదిజాబితా ప్రకటించారు. తుదిజాబితాలోనూ యథావిధిగా తప్పులు కనిపిస్తూనే ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యమా! రాజకీయ వర్గాల ప్రమేయమో.. ఏదైతేనేం ఓటర్ల జాబితాపై విమర్శలు తప్పడం లేదు. డబుల్ ఎంట్రీలు, గ్రామాలలో లేనివారికి ఓటర్ల జాబితాలో ఓటు ఉండడం లాంటి తప్పులు ఒకరకమైతే.. చనిపోయిన వారికీ ఓట్లు ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. చనిపోయిన వారి పేర్లు ఓటరు లిస్టులో ఉండటం చూసి ప్రేతాత్మలు వచ్చి ఓట్లు వేస్తాయా అంటూ కొందరు విమర్శిస్తున్నారు. నెలలు కాదు.. ఏళ్ల క్రితం చనిపోయిన వారి ఓటు తొలగించకపోవడం చూస్తే క్షేత్రస్థాయిలో ఎన్నికల అధికారులు తూతూమంత్రంగా పనిచేశారని తెలుస్తోంది.

చనిపోయిన వారి పేర్లు..

ఓటరు జాబితాలో జరిగిన కొన్ని తప్పులు పరిశీలిస్తే.. పోరుమామిళ్ల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన కాకర్ల మహబూబ్‌బాష మూడేళ్ల క్రితమే చనిపోయారు. అయినా ఓటర్ల జాబితాలో ఆయన పేరు తొలగించలేదు. ఈ విషయాన్ని మృతుడి సోదరుడే రఫీ తెలిపారు. బ్రహ్మంగారిమఠం మండలం నరసన్నపల్లె పోలింగ్ కేంద్రం 242 పోలింగ్ బూత్‌లోని ఓటర్ల జాబితాలో దేవరకొండ చిన్న సుబ్బయ్య(80) ఇంటినెంబరు 9/39, ఓటరు కార్డు నెంబర్ ఆర్‌టీటీ 0250118గా నమోదై ఉంది. ఈయన చనిపోయి చాలాకాలమైంది. ఇదే గ్రామంలోని లెక్కల చిన్న వెంకటరెడ్డి, ఓటరుకార్డు నెం. హెచ్‌పీ జే 17573319 చనిపోయారు. ఆయన పేరు కూడా ఓటరు జాబితాలో ఉంది.


ఊర్లో లేకున్నా..

చనిపోయిన వారి పేర్లే కాదు స్థానికంగా గ్రామంలో లేనివారి పేర్లు కూడా ఓటరు జాబితాలో ఉన్నాయి. గ్రామంలో బోడోల్ల నరసమ్మ లేకపోయినా ఇంటి నెం.10/102లో ఓటరు కార్డు ఆర్‌టీటీ 0671678తో ఓటు నమోదయింది. అలాగే చిన్నశెట్టి శ్రీరాములు గ్రామంలో లేకపోయినా డోర్ నెం.9/236లో హెచ్‌పీజే 0769661తో ఆయన పేరు ఓటర్ల జాబితాలో ఉంది. సోమిరెడ్డిపల్లె పోలింగ్ కేంద్రం 234లో దాదాపు 30 మంది మృతుల పేర్లు అలాగే ఉన్నాయి. ఈ పోలింగ్ కేంద్రంలో 705 ఓట్లు ఉండగా అందులో చాలావరకు డబుల్ ఎంట్రీ ఉన్నాయి. బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాలలో డబుల్ ఎంట్రీ ఓట్లు కూడా నమోదు అయ్యాయన్న ఆరోపణలు వస్తున్నాయి. తుది జాబితాలోనూ ఇన్ని తప్పులుంటే ఎన్నికలు పారదర్శకంగా ఎలా నిర్వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.


తుది జాబితాలోనూ తప్పులే..

● ఓటర్ల వయసు 125 ఏళ్లుగా నమోదు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 11: ఎన్నికల సంఘం జనవరి 22న విడుదల చేసిన తుది ఓటరు జాబితాలోనూ తప్పులు దొర్లాయి. ప్రొద్దుటూరు ఓటరు జాబితా తప్పుల తడకగా ఉండటంతో నెలక్రితం ఎన్నికల సంఘం ఈఆర్‌వో రామ్మోహన్‌ను సస్పెండ్ చేసింది. అయినా ఇక్కడ ఎన్నికల సిబ్బంది నిర్లక్ష్యం వీడలేదు. డబుల్ ఎంట్రీలు, డెత్‌క్లైమ్స్‌కు సంబంధించి జనవరి 23 తరువాత కూడా ఫాం-7 వందల సంఖ్యలో వచ్చాయి. దీన్నిబట్టి జాబితాలో ఇంకా ఎన్నో తప్పులు దొర్లినట్లు తెలుస్తోంది. ప్రొద్దుటూరులో వంద సంవత్సరాలకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు లేరని ఎన్నికల అధికారులు ప్రకటించారు. అయితే తుది జాబితాలో మళ్లీ 125 ఏళ్ల, 100 ఏళ్ల ఉన్నట్లు తప్పులు దొర్లినాయి. ఇందులో పోలింగ్‌బూత్ 19లో జిల్లెల గుర్రమ్మ (100), 40వ బూత్‌లో దేవారెడ్డి లక్షుమ్మ (100), 43వ బూత్‌లో గొర్రె పెద్దవీరా(100), 49వ బూత్‌లో మెట్టగాళ్ల రమేశ్(101), 81లో వంగలి ఖాజావలి(100), 122లో జింకా రంగమ్మ(100), 145లో యార్ల అచ్చమ్మ(101), 146లో నీలి సబ్‌బామా(100), 174లో దేవిరెడ్డిలక్ష్మీ నరసమ్మ(104), 181లో గోవిందు రామ్మోహన్(125), 184లో ఆదినేని లక్షుమయ్య(125), 188లో రాచమల్లు గంగాభవాని, 195లో సనా వాసు(101), 221లో రామనబోయిన చెన్నమ్మ(100), 254లో యడమకంటి పవన్‌కుమార్(102) వందేళ్లు దాటిన వారు ఉన్నట్టు తుదిజాబితాలో ఉన్నట్టు గుర్తించారు. ఇంకా చాలా బూతుల్లో పరిశీలించాల్సి ఉంది. వీటిని తుది జాబితాలో సవరించలేదు. ఇప్పటికైనా ఈ వయసు తప్పులను సవరించాల్సిందిగా ఓటర్లు కోరుతున్నారు.



184 పోలింగ్‌కేంద్రంలో ఆదినేని లక్షుమయ్యకు 125 ఏళ్లు ఉన్నట్లు తప్పుగా నమోదు



181 పోలింగ్‌స్టేషన్‌లో గోవిందు రామ్మోహన్‌కు 125 ఏళ్లు ఉన్నట్లు నమోదు

కోతల.. కరెంటు

- 9 గంటల విద్యుత్ సరఫరా ఎత్తివేసి.. 7 గంటలే ఇస్తున్నారు
- ఎండుతున్న సజ్జ, మొక్కజొన్న, వరి పంటలు
- రైతులు అడిగితే ఎల్ఆర్ అంటున్న విద్యుత్ అధికారులు
- కనీసం 20 రోజులైనా తొమ్మిది గంటల కరెంటు ఇవ్వాలని వేడుకోలు

బి.కోడూరు, ఫిబ్రవరి 11: ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతులను కరెంటు కోతలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న పైర్లు కళ్ల ముందే ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఏమి చేయాలో అర్థకం కాక సతమతమవుతున్నారు.

ప్రభుత్వం వ్యవసాయానికి నిరంతరాయ 9 గంటల విద్యుత్ ప్రకటించడంతో రైతులు బోర్ల కింద విస్తారంగా పంటలు సాగు చేశారు. ఇపుడు పంటలు చేతికివచ్చు సమయంలో 7గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేయడం.. అది కూడా ఎప్పుడు పడితే అప్పుడు కోతలు విధిస్తుండటంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది బి.కోడూరు మండలంలో ఎకరాకు 30 నుంచి 40 వేల వరకు పెట్టుబడి బోర్ల కింద పంటలు సాగు చేశారు. 3వేల ఎకరాల్లో మొక్కజొన్న, సజ్జ మూడువేల ఎకరాలు, వరి 2వేల ఎకరాలు.. ఇలా దాదాపు 7వేల ఎకరాలలో పంటల సాగు చేపట్టారు. ప్రతి ఏడాది ఒక్కో రైతు బోరు కింద 3 ఎకరాలు మాత్రమే సాగు చేసేవారు. ఈ ఏడాది 5 నుంచి 7 ఎకరాలు సాగు చేశారు. సాగు చేసిన సజ్జ, జొన్న, వరి గింజ పట్టి చేతికందే దశలో ఉంది. ఉన్నట్లుండి 9గంటల కరెంటు తొలగించి 7గంటలు ఇస్తున్నారు. అది కూడా కోతలు విధిస్తూ ఇష్ట మొచ్చినట్లు సరఫరా చేస్తున్నారు. ఎవరైనా రైతులు అడిగితే ఎల్ఆర్ అని విద్యుత్ అధికారులు తప్పించుకుంటున్నారు. దీంతో సాగు చేసిన పంటలన్నీ నీటి తడులు అందక దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. ఈ విషయమై విద్యుత్ ఏడీ నాయక్‌ను వివరణ కోరగా, పై నుండే ఆ విధంగా ఇవ్వమని చెబుతున్నారు, కాబట్టి మేం పాటించక తప్పదని అంటున్నారు.



ఎండుతున్న మొక్కజొన్న పంట

9గంటల కరెంటు నమ్ముకుని...



నాకున్న బోరు కింద రెండు ఎకరాలు సజ్జ, రెండు ఎకరాలు వరి సాగు చేశాను. ఎకరాకు 40 నుంచి 50వేల వరకు పెట్టుబడులు పెట్టాను. అది గింజ పట్టి చేతికందే దశలో ఉన్నట్లుండి 9గంటల కరెంటు తొలగించి ఏడుగంటలే విద్యుత్ అందిస్తున్నారు. దీంతో నీటి తడులు అందక పంటలు ఎండి పోతున్నాయి. ఈనెల చివరి వరకైనా 9గంటలు విద్యుత్ సరఫరా చేయాలి.

- రమణారెడ్డి, రైతు, గోవిందాయపల్లె

మొక్కజొన్న పంట ఎండుతోంది



నేను వ్యవసాయ బోరు కింద మొక్కజొన్న సాగు చేశాను. అది కంకి గింజ పట్టే దశలో ఉంది. కరెంటు చూస్తే ఏడుగంటలే ఇస్తున్నారు. అది కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. 9గంటలు వ్యవసాయ కరెంటు నెలచివరి దాకా ఇస్తే బాగుంటుంది. అధికారులు రైతులను అర్థం చేసుకోవాలి.

- సిద్దు వెంకటసుబ్బారెడ్డి, రైతు, మేకవారిపల్లె

వణ్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- స్మగ్లర్లపై నిఘా పెట్టేందుకు బేస్ క్యాంపుల నిర్వహణ
- ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి



జంతువుల దాహం తీర్చేందుకు తొట్లలో నీటిని నింపుతున్న అటవీ సిబ్బంది

సిద్దవటం, ఫిబ్రవరి 11: వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి, డిప్యూటీ రేంజ్ అధికారి ఓబులేసులు పేర్కొన్నారు. మండలంలోని లంకమల అభయారణ్యంలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన్యప్రాణుల సంఖ్యను పెంచేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. స్మగ్లర్లను ఏరివేసేందుకు పలు చోట్ల బేస్‌క్యాంపులు ఏర్పాటు చేశామని, అడవిలో వేటగాళ్లు వన్యప్రా ణులకు హాని తలపెట్టకుండా సీసీ కెమెరాల పరిరక్షణ ఉంటుందన్నారు. ఎండకాలం సమీపిస్తుండటంతో జంతువుల దాహం తీర్చేందుకు నీటి కుంటల్లో, చెక్ డ్యాంలలో సాసర్ పిట్లలో నీటి నింపే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అడవిలో అగ్ని ప్రమాదాల నివారణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. అడవుల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా అడవికి సమీపంలోని గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అడవులు లేకపోతే మానవులు మనుగడ ఎలా ఉంటుందో వివరిస్తున్నామన్నారు. అటవీ ప్రాంతంలో రహదారులలో వెళుతున్న వాహ నదారులు 30కి మించి స్పీడ్ వెళ్లరాదని.. అతివేగంతో వెళితే వాహనాలు ఢీకొని జంతువులు మృత్యువాత పడే అవకాశం ఉందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు



చోరీకి పాల్పడిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసులను చూపుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 11: పులివెందుల పట్టణంలో ఒంటరిగా ఉన్న ఓ మహిళ ఇంట్లో చొరబడి చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత నెల 25వ తేదీ పులివెందుల పట్టణం కదిరిరోడ్డు సమీపంలోని ఓ ఇంటిలో మహిళ ఒంటరిగా ఉండగా మాస్కు ధరించి కత్తి తీసుకొని ఇంట్లోకి ప్రవేశించి.. మెడలోని రెండు తులాల బంగారు గొలుసులని లాక్కొని పారిపోయాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కేసులో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అందిన సమచారం మేరకు సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ అరుణ్‌రెడ్డిలు తన సిబ్బందితో ముద్దనూరు రింగురోడ్డులో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. అతడి నుంచి రెండు గొలుసులను, చోరీకి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు...ఒకరి మృతి

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 11: మైదుకూరు సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ప్రొద్దుటూరుకు చెందిన సాయి లక్ష్మీనాధరావు (40) అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... సాయి లక్ష్మీనాధరావు వృత్తి రిత్యా ఫొటోగ్రాఫర్. క్యాంపు పనిమీద ప్రొద్దుటూరు నుంచి కడపకు వెళుతూ మైదుకూరు సమీపంలోకి రాగానే వెనుక నుంచి కారు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

వీరబల్లి, ఫిబ్రవరి 11: మండల పరిధిలోని వంగిమళ్ల పంచాయతీకి చెందిన నాగన్న అనే వ్యక్తి దగ్గర 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. అదేవిధంగా సానిపాయికి చెందిన రమణ అనే వ్యక్తి దగ్గర 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం ఇద్దరికి గాయాలు

పెద్దతిప్పసముద్రం/బి.కొత్తకోట, ఫిబ్రవరి 11 : రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా ఇద్దరు గాయపడిన సంఘటన పీటీఎం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా... మల్లెల పంచాయతీ కాప్పల్లికి చెందిన సురేష్ అనేపేర్లు గల ఇద్దరు వ్యక్తులు శనివారం రాత్రి తమ స్వంత పనుల నిమిత్తం బి.కొత్తకోటకు తమ ద్విచక్రవాహనంలో వెళ్లి వస్తుండగా మల్లెల క్రాస్ సమీపంలోకి రాగానే వాహనంలో పెట్రోల్ అయిపోయింది. దీంతో వారు ద్విచక్ర వాహనాన్ని తోసు కుంటు వస్తుండగా ఇదే మల్లెల పంచాయతీ పెద్దమేకలవారిపల్లెకు చెందిన రాఘవరెడ్డి (45) అనే అతను బి.కొత్తకోట నుంచి తమ స్వగ్రామమైన పెద్దమేకలవారిపల్లెకు వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి వారి మీదకు వేగంగా దుసుకెళ్లడంతో సురేష్‌లు ఇద్దరికి గాయాలయ్యాయి. ద్విచక్రవాహనం వేగంగా వచ్చి వారిని ఢీకొని పక్కనే ఉన్న కాలువలోకి పడిపోవడంతో రాఘవరెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు గమ నించి హుటాహుటిన 108 వాహనానికి సమాచారం అందించ డంతో హుటాహుటిన వాహనం అక్కడికి చేరుకోగా 108 సిబ్బంది రాఘవరెడ్డి పరిక్షించి అతను మృతి చెందాడని నిర్ధారించారు. గాయపడిన వారిని ఇద్దరిని బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడున్న స్థానికులు రాఘవరెడ్డి బంధువులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పోస్టు మార్టం నిమిత్తం మదనపల్లెకు తర లించారు. అనంతరం మృతదేహాన్ని తన స్వగ్రామమైన మల్లెల పంచాయతీ పెద్దమేకలవారిపల్లెలో ఆదివారం రాత్రి దహన క్రియలను పూర్తి చేశారు. మృతుడికి భార్య సులోచన 4సంవత్స రాల కుమార్తె 8నెలల కుమారుడు ఉన్నారు. రాఘవరెడ్డి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. రాఘవరెడ్డి టీడీపీ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసే కార్యకర్త కావడంతో పలువురు టీడీపీ నేతలు వచ్చి నివాళులర్పించారు.

అప్పులతో వస్త్ర వ్యాపారి పరారీ

మదనపల్లె, ఫిబ్రవరి 11: మదనపల్లె పట్టణం ఎన్‌టీఆర్ సర్కిల్ సమీపంలోని వస్త్ర దుకాణం నడుపుతున్న ఓ వ్యాపారి అప్పులు చేసి పరారయ్యాడు. పెద్దమండ్యం మండలం మందలవారిపల్లెకు చెందిన ఈయన..కొన్నేళ్లుగా పట్టణంలోని ఉంటూ వస్త్ర వ్యాపారం చేస్తున్నాడు. ఇందులోభాగంగా స్థానికంగా వ్యాపారులు, తెలిసిన వారి నుంచి అప్పులు చేశాడు. అయితే వ్యాపారంలో నష్టాలు రావడంతో దుకాణం మూసివేసి అదృశ్యమయ్యాడు. మదనపల్లె, పెద్దమండ్యం ఏరియాలకు చెందిన వారి నుంచి సుమారు రూ.కోటికి పైగా అప్పు చేసినట్లు చెబుతున్నారు. రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో దుకాణం మూసివేసి పరారైనట్లు భావిస్తున్నారు. దుకాణం మూతపడటం, ఆయన అందుబాటులో లేకపోవడంతో రుణదాతలకు అనుమానం వచ్చి స్థానికంగాను, స్వగ్రామంలోనూ ఆరా తీసినా ఆచూకీ లభించక పోవడంతో బాధితులు కొందరు స్థానిక టూటౌన్, పెద్దమండ్యం పోలీసులను ఆశ్రయించారు. దీనిపై పోలీసులు విచారణ చేప ట్టారు.

ఆటో బోల్తా..యువకుడి పరిస్థితి విషమం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 11: ఆటో బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న ఓ యువకుడు తీవ్రగాయాలపాలైన సంఘటన గుర్రంకొండ మండలంలో చోటు చేసుకుంది. మదనపల్లె పట్టణం చంద్రాకాలనికి చెందిన మల్లికార్జున(18), వెంకటేశ్ చంద్ర, గణేష్‌లు కలసి గ్రామాల్లో గుజిరి సామాన్లు కొనుగోలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో రెండు నెలల క్రితం మల్లికార్జున ఆటో కొనుగోలు చేసి గ్రామాల్లో గుజిరీ సామాన్లు మదనపల్లెకు తరలించేవారు. ఆదివారం ఉదయం వారు నలుగురు గుర్రం కొండకు ఆటోలో వెళుతుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో మల్లికార్జున తలకు తీవ్రగాయాలు కాగా, మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు 14 మంది ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

బద్వేలు, ఫిబ్రవరి 11: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శని, ఆదివారం రెండు రోజుల పాటు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. జిల్లా స్థాయిలో 140 ప్రదర్శనలు రిజిస్ట్రేషన్‌కు ఎంపిక కాగా... వాటిలో 14 ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి నేషనల్ అబ్జర్వర్‌గా వచ్చిన మహిమ, కార్తికేయలు ప్రకటించినట్లు జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు మెమెంటోలు ఇచ్చి అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాల్యదశ నుంచే శాస్త్ర సాంకే తిక రంగాలలో ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభను కనపరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యేలా ప్రయత్నం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరామిరెడ్డి, వెంకట క్రిష్ణారెడ్డి, డాక్టర్ ఫక్రుద్దీన్, ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు వీరే

బద్వేలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సాత్విక్, చక్రాయపేట మండలం ఉప్పలవాండ్లపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన గణేష్, చాపాడు మండలం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన చరణ్, చాపాడు మండలం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఆసిఫా, ప్రొద్దుటూరు ఎస్‌కే సబీఎస్ ఉన్నత పాఠశాలకు చెందిన చాతుర్య, కమలాపురం పాఠశాలకు చెందిన రుద్వేద, కడప నాగార్జున ఉన్నత పాఠశాలకు చెందిన హితేన్ జైన్, నాగార్జున మోడల్ స్కూల్‌కు చెందిన అభిలాష్, అలాగే నిర్మల హైస్కూల్‌కు చెందిన సయ్యద్ సోఫియా, కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.గౌతమి, లింగాల మండలానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బండి ప్రగతి, పులివెందుల, విద్యాధరి ఉన్నత పాఠశాలకు చెందిన షర్మి, సిద్దవటం ఉన్నత పాఠశాలకు చెంది నిత్యపూజయ్య, అదే మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అభిలాష్‌లు ఎంపియ్యారు

పులివెందులలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 11: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యమని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. పులివెందులలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో మొదటి నుంచి కాంగ్రెస్‌కు కంచుకోట అని, 17సార్లు ఎన్నికలు జరగ్గా 13సార్లు కాంగ్రెస్ గెలిచిందన్నారు. పైడిపాళెం రిజర్వాయర్, లింగాల కెనాల్, గండికోట-సీబీఆర్ ఎత్తిపోతల, జేఎన్టీయూ, ట్రిపుల్‌ఐటీ, అంతర్జాతీయ పశుపరిశోధనా కేంద్రం, శిల్పారామం, రింగురోడ్డు, భూగర్భడ్రైనేజీ, సిమెంటురోడ్లు, పులివెందుల-కడప నాలుగు వరుసల రోడ్డు ఇవన్నీ కాంగ్రెస్ పాలనలోనే పూర్తి అయ్యాయన్నారు. కాంగ్రెస్ పాలనలో పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, బిందుసేద్యం పరికరాలు సకాలంలో అందేవన్నారు. జగన్ పాలనలో పులివెందుల అసాంఘిక శక్తుల అడ్డాగా మారిందన్నారు. వివేకానందరెడ్డి హత్య జరిగి ఐదేళ్లయినా దర్యాప్తు పూర్తికాలేదన్నారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ నిధులు లేక వెలవెలబోతోందన్నారు. ఈనేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ గెలవాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉందన్నారు. మీడియా సమావేశంలో పులివెందుల మండలశాఖ అధ్యక్షులు తిరుపేలరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్, వెంగళరెడ్డి, నాగరాజు, ఉత్తన్న, వినయ్, నిఖిల్, శరత్‌చంద్ర, జగన్‌మోహన్‌రెడ్డి, స్టాన్లీబాబు, చిన్న, శ్రీనివాసులు, గంగాదర తదితరులుపాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిపించాలి... అఖిలపక్ష నేతలు



మాట్లాడుతున్న అఖిలపక్ష పార్టీల నేతలు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 11 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అసాంఘిక శక్తులను అరికట్టి ఎన్నికలు ప్రశాంతంగా జరిపించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనరు బందెల ఓబయ్య అధ్యక్షతన ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన చర్చా వేదికలో బీసీ సంఘం నాయకులు, చేతివృత్తుల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లిఖార్జున, జనతాదళ్ నేత ప్రతాప్‌రెడ్డి, గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక రాష్ట్రకన్వీనరు కారు ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డి, మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంగటి మనోహర్, ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నేత జేవీ రమణ, ఆమ్‌ఆద్మీ పార్టీ నేత శ్రీనివాసులు, హేతువాద సంఘం కన్వీనరు సీఆర్‌వీ, ప్రముఖ న్యాయవాది అమీన్‌పీరా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండి జకరయ్య, మహిళా సంఘం నాయకురాలు శ్యామల, లక్ష్మి, రైతు సేవా సమితి అధ్యక్షుడు పి.శివారెడ్డి, కేబుల్ ఆపరేటర్ల సంఘం నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి, దళిత ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు రెడ్డన్న మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, పోటీ చేసే అభ్యర్థులు సామరస్యంతో ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు. అధికారులు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులపై నిఘా ఉంచాలన్నారు. ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో జరగకూడని సంఘటనలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. అందులో భాగంగా జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎమ్మెల్యే తన ప్రత్యర్థి అభ్యర్థిని బెదిరించడం, డిప్యూటీ సీఎం తమ్ముడు ప్రత్యర్థి మహిళా అభ్యర్థి విషయంలో ప్రవర్తించిన తీరు సరికాదన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై సోషల్ మీడియాలో వస్తున్న ఘటనలు, వ్యక్తిగత దూషణలు సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉన్నాయన్నారు. డిప్యూటీ సీఎం తమ్ముడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరు, ఎస్పీలను కలవనున్నట్లు వారు తెలిపారు.

జడ్పీ చైర్మన్‌కు పదవీ గండం?

- కొత్త చైర్మన్ రేసులో బి.మఠం జడ్పీటీసీ



కడప, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి పదవీగండం పొంచిఉన్నట్లు చెబుతున్నారు. అమర్‌నాథరెడ్డిని ఆ పార్టీ అధిష్టానం వైసీపీ రాజంపేట సమన్వయకర్తగా నియమించింది. వచ్చే ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీ స్థానానికి వైసీపీ తరపున ఆయన పోటీ చేయడం దాదాపు ఖరారైనట్లే. ఈ నేపథ్యంలో ఆయనను జడ్పీ చైర్మన్ పదవి నుంచి త్వరలో తప్పిస్తారని సమాచారం. జడ్పీ చైర్మన్ స్థానాన్ని బి.మఠం జడ్పీటీసీ రామగోవిందరెడ్డి ఆశిస్తున్నట్లు చెబుతున్నారు.

ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు ఏకపక్షంగా సాగాయి. ప్రతిపక్షనేతలు నామినేషన్లు వేసే పరిస్థితి లేదు. కొన్నిచోట్ల నామినేషన్లు వేసినా రకరకాల కారణాలతో తిరస్కరణకు గురైతే కొందరు బరిలో లేని పరిస్థితి నెలకొంది. టీడీపీ గోపవరం జడ్పీటీసీ స్థానాన్ని మాత్రమే గెలుచుకోగా మిగతా 49 స్థానాలను వైసీపీ గెలుచుకుంది. అనంతరం ఉమ్మడి జిల్లా విభజన జరిగి రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు అన్నమయ్య జిల్లాలో చేరాయి. అయినప్పటికి పాత పాలకవర్గమే కొనసాగుతోంది. అమర్‌నాథరెడ్డిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేయడంతో జడ్పీ చైర్మన్ పదవిపై ఊహాగానాలు రేకెత్తుతున్నాయి. చైర్మన్ పదవి కోసం బి.మఠం జడ్పీటీసీ రామగోవిందరెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈయన కాంట్రాక్టర్. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం భారీగా ఖర్చుపెట్టానని ఇపుడు తనకు పదవి ఇవ్వాల్సిందేనంటూ ఆయన డిమాండ్ చేస్తున్నట్లు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. పదవి ఇవ్వకపోతే పార్టీ మారేందుకు ఈయన సిద్ధమైనట్లు వైసీపీలో చర్చ నడుస్తోంది. ఈ పదవి కోసం అన్నమయ్య జిల్లాకు చెందిన జడ్పీటీసీలు కూడా ముమ్మర ప్రయత్నాల్లో ఉన్నారంటున్నారు. అయితే చైర్మన్ పదవి ఆశిస్తున్న వారి నుంచి జడ్పీటీసీ సభ్యులు కొంత డబ్బు డిమాండ్ చేస్తున్నారని తెలిసింది. అయితే ఆల్‌రెడీ తాను ఖర్చుపెట్టానని ఇప్పుడు ఇచ్చేది లేదంటూ రామగోవిందరెడ్డి తెగేసి చెప్పినట్లు తెలిసింది.

పాత పెన్షన్‌పై పెదవి విప్పండి: యూటీఎఫ్



కలెక్టరేట్ ఎదుట పోస్టర్లు అతికిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 11 :పాతపెన్షన్ అమలుపై ప్రభుత్వం పెదవి విప్పాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టరును కడప కలెక్టరేట్, డీఈఓ కార్యాలయంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో గోడలకు అతికించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాత పెన్షన్ సాధన కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి జీపీఎస్ అనే మరో దుర్మార్గ పెన్షన్ విధానం ప్రవేశపెట్టడం మోసగించడమేనన్నారు. పాత పెన్షన్ సాధన కోసం అన్ని రాజకీయ పార్టీలను కలిపి రాజకీయ అంశంగా మారుస్తామన్నారు. అందులో భాగంగానే ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదంతో వాల్‌పోస్టరు ద్వారా సమస్యను రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. పాత పెన్షన్ సాధన సమస్యను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. పాత పెన్షన్‌ను పునరుద్ధరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేదంటే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, కరీముల్లా, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 11: జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని ఈ నెల 12న సోమవారం ఉదయం 10 గంటల నుంచి రాయచోటి జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యధావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. అలాగే స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులకు స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు.

జనరంజక పాలన టీడీపీకే సాధ్యం

● టీడీపీ ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

వల్లూరు, ఫిబ్రవరి 11 : జనరంజక పాలన టీడీపీకే సాధ్యమని టీడీపీ ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుగ్యారంటీ కార్యక్రమాన్ని దిగువపల్లె గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి టీడీపీ వస్తే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా అందించిన ప్రయోజనాలను వివరించారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. మరో పక్క యువనేతలు క్రిష్ణచైతన్యరెడ్డి, లక్ష్మీరెడ్డి, సాయి నరసింహారెడ్డి కూడా టీడీపీ వస్తే ప్రజలకిచ్చే సంక్షేమ పథకాలను వివరించారు. ఇప్పటికే రాష్ట్రం అధోగతి పాలైందని, వాటి నుంచి బయటపడాలంటే టీడీపీని గెలిపించాలన్నారు. అంతకు ముందు దాదాపు వందకు పైగా ద్విచక్ర వాహనాలతో కట్ట నుంచి దిగువపల్లె వరకు పుత్తాకు స్వాగతం పలికారు. అనంతరం ఆ గ్రామస్థులు బాణసంచా పేల్చారు. మహిళలు హారతులు పట్టి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన కమలాపురం ఇన్‌చార్జ్ వేణు గోపాల్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు సుధారమణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, వై.శివారెడ్డి, సుధా మదన్‌మోహన్‌రెడ్డి, బాల గంగిరెడ్డి, శివారెడ్డి, మాజీ సర్పంచ్ మద్దెన్న, గడికోట సుధాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, శీతోరుపల్లె ప్రభాకరరెడ్డి, రాఘవరెడ్డి, సురేష్, శ్రీనివాసులరెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డికి బైకు ర్యాలీతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు (ఇన్‌సెట్) మహిళకు టీడీపీ పథకాలను వివరిస్తున్న పుత్తా

పులివెందుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

● మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 11: పులివెందుల అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని యర్రగుడిపల్లెలో బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. మహాశక్తి పథకం కింద మహిళలకు, యువగళం పేరిట యువతకు పెద్దపీట వేయనున్నామన్నారు. రోజురోజుకు టీడీపీకి ఆదరణ పెరుగుతోందన్నారు. ప్రతి కార్యకర్త టీడీపీ గెలుపునకు సైనికునిడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో బీటెక్ రవి

కడప నగరంలో మహిళలకు రక్షణలేదు

● టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 11 : కడప నగరంలో మహిళలకురక్షణ లేదని టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వంలోనే మహిళలకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. ఆదివారం కడప నగరం 49వ డివిజన్ అలంఖాన్‌పల్లెలో స్థానికులు భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ మాధవీరెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టీడీపీకి వస్తున్న ఆదరణచూసి ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ఓర్వలేకపోతున్నారన్నారు.తనను ప్రశ్నిస్తున్న అంజద్‌బాషా తాను ఎక్కడ నుంచి వచ్చాడో ఒకసారి గుర్తు తెచ్చుకోవాలన్నారు. సిద్దవటం నుంచి అంజద్‌బాషా బైకు మెకానిక్‌లా కడపకు వచ్చారన్నారు. ఇప్పటికీ అంజద్‌బాషాపై చెక్‌బౌన్స్ కేసులున్న విషయం గుర్తు చేశారు. అంజద్‌బాషా 2019 నుంచి 2024 వరకు రూ.2500 కోట్లు అక్రమ ధనం సంపాదించుకున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సుబ్బారెడ్డి, చంద్రబాబు, జీవన్, యువరాజు, గంగిరెడ్డి, వేణు, రాజా, సోనీ, గంగిశెట్టి, శ్రీను, నిత్య, సాయి, భరత్, నవీన్, జిలానీ పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో మాధవీరెడ్డి తదితరులు

బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ

49వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని మాధవీరెడ్డి నిర్వహించారు. ఇంటింటికీ వెళి కరపత్రాలు పంచిపెట్టి ప్రజలకు వైసీపీ చేస్తున్న అరాచకాలు వివరించారు. అలాగే టీడీపీ వచ్చాక చేపట్టే సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం: టీడీపీ

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 11: కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం కడప నగరం 39వ డివిజన్‌లో టీడీపీ కార్యకర్త ఆరిఫ్ కుటుంబాన్ని ఆమె పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఆరిఫ్ కుటుంబంపై ఉప ముఖ్యమంత్రి సోదరుడు, అతని అనుచరులు స్టేషన్‌లో దాడి చేసి ఆపై అధికారం ఉపయోగించి అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపించారన్నారు. అండగా ఉంటామని, కార్యకర్తలు అధైర్యపడవద్దని పేర్కొన్నారు.

శ్రీనివాసరెడ్డి కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకోం

● ముస్లింలకు టీడీపీ పెద్దపీట ● మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్

వేంపల్లె, ఫిబ్రవరి 11: టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి కుటటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేస్తే మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, టీడీపీ మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లాబక్ష, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలిలు హెచ్చరించారు. వేంపల్లెలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష సోదరుడు నోరు అదుపులోకి పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. టీడీపీ ముస్లిం మైనార్టీలకు ఎన్నో పథకాలు అమలు చేసిందని గుర్తుచేశారు. ముస్లింలు టీడీపీ అధికారంలో ఉంటే ముస్లింలు రాష్ట్రంలో క్షేమంగా ఉంటటారన్న విషయం అందరికి తెలుసునన్నారు. వైసీపీలో ముస్లింలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో పీరాసాహెబ్, ఇలియాస్, డాక్టర్‌కరిముల్లా, అబ్దుల్, మహమ్మద్, ఇనయతుల్లా, వెల్డింగ్ బాష పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్

జాబితాలో అభ్యంతరాలుంటే తెలియజేయండి : ఆర్డీఓ

పులివెందుల, ఫిబ్రవరి 11: ఓటర్ల జాబితాలో ఏవైన అభ్యంతరాలు అందితే సవరిస్తున్నామని పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాపై, ఎన్నికల సన్నద్ధతకు చేపట్టిన చర్యలను విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 22వ తేదీన ఓటర్ల తుది జాబితా ముసాయిదా విడుదల చేయడం జరిగిందన్నారు. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 301 పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను అన్ని రాజకీయ పార్టీలకు సమాచారం అందించడం జరిగిందన్నారు. ఈ తుది జాబితాలో 110829మంది పురుషులు, 116605మహిళలు, 19 మంది థర్డ్ జండర్ ఓటర్లు కలిపి 227453 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అలాగే నియోజకవర్గంలో 403 సర్వీసు ఓటర్లు ఉన్నారన్నారు. మొత్తం చేర్పులు 7811 కాగా ఓటర్లు 5735గా నమోదయ్యాయన్నారు. 10.02.2024 వరకు ఫారం-6,7, 8 మొత్తం 2535 ఫిర్యాదులు స్వీకరించడం స్వీకరించామన్నారు. తహసీల్దార్ రమేష్‌బాబు,ఎలక్షన్ డీటీ జగదీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశులు

నామమాత్రంగా యురేనియం మెడికల్ క్యాంపులు

వేముల, ఫిబ్రవరి 11: మండలంలోని యురేనియం ప్రభావిత ప్రాంతాల్లో యూసీఐఎల్ ఆధ్వర్యంలో నిర్వహించే మెడికల్ క్యాంపులు నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. వారంలో రెండురోజులు జరిగే క్యాంప్‌లో కేవలం 20 నుంచి 30నిమిషాల వరకు గ్రామాల్లో ఉంటున్నారు. ఆదివారం భూమయ్యగారిపల్లెలో నిర్వహించిన క్యాంప్‌లో కేవలం 20 నిమిషాల వరకే ఉన్నారు. దీనిపై ప్రశ్నిస్తే రోజంతా ఉండంకదా అని సిబ్బంది తెలిపారు. ఎప్పుడు వచ్చేది వెళ్లేది అందరికి తెలుసు ఆలోపు వచేచ వారికి మందులు ఇస్తాం వెళ్తాంఅని అంటున్నారని స్థానిక ప్రజలు తెలిపారు. ప్రశ్నిస్తే కసురుకుంటున్నారని,దురుసుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఫార్మాసిస్ట్ స్థానికుడు కావడంతో ఎవరుఏం మాట్లాడడం లేదు. ప్రజల ఆరోగ్యం మీద యురేనియం సంస్థ సిబ్బందికి ఎంత శ్రద్ధ ఉందో అర్థం అవుతుంది. డాక్టర్ చేతిలో స్టెతస్కోప్ లేదు, బిపి మిషన్ లేదు అలాంటపుడు ఈ క్యాంపులు ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



వాహనంలో కూర్చొని మందులు ఇస్తున్న సిబ్బంది

'కార్యకర్తలు మనోధైర్యంతో మెలగాలి'

చక్రాయపేట, ఫిబ్రవరి 11: టీడీపీ కార్యకర్తలు మనోధైర్యంతో మెలగాలని రానున్నది మంచిరోజులని మాజీ ఎమ్మెల్సీ బీటెక్‌రవి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సురభి గ్రామం బాలతిమ్మయ్యగారిపల్లెకు చెందిన టీడీపీ మండల యువనాయకులు తొడలమలదిన్నె అమర్‌నాథ్ నూతన గృహ ప్రవేశానికి బీటెక్ రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డికి, బీటెక్ రవికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ వచ్చేవి మంచి రోజులని ధైర్యంగా ఉండాలని సూచించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తర లేఖ పోటీలకు విశేష స్పందన

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 11: కడప తపాలా శాఖ ప్రధాన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉత్తర లేఖ పోటీలకు బాలబాలికల నుంచి విశేష స్పందన లభించింది. కడప డివిజన్ పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు సుమారు 50 మంది హాజరై ఉత్తర లేఖ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఇందులో ప్రధానంగా తపాలా శాఖ ఏర్పాటై సుమారు 150 సంవత్సరాలకుపైగా కావస్తున్న నేపథ్యంలో ఆ శాఖ విశేషాల గురించి లేఖ యూనివర్సల్ హాస్టల్ యూనియన్ సారధ్యంలో పోటీలను నిర్వహించారు. పిల్లల్లో పోటీతత్వం అలవాటు చేయాలనే ధ్యేయంతో ప్రతిసంవత్సరం యూనివర్సల్ పోస్టల్ పోటీలను చేపడుతున్నట్లు పోస్టల్ డీఎస్పీ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ఆర్టిస్ట్ రఘుకు ఆర్సీపీ అశ్రునివాళి

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి11:ఆర్టిస్ట్ రఘుకు ఆర్సీపీ ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించినట్లు రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా కమ్యూనిస్టు కార్యక్రమాలకు వాల్‌రైటింగ్ రాస్తూ మంచి గుర్తింపు పొందిన కామ్రేడ్ రఘు సేవలు మరువలేనివన్నారు. పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన స్వగృహంలో నివాళులర్పించారు. రాయలసీమ మహిళా సంఘం కార్యదర్శి తస్లిం మాట్లాడుతూ రఘులాంటి అంకితభావం కలిగిన కామ్రేడ్‌ను కోల్పోవడం బాధాకరమన్నారు. ఆర్సీపీ నగర కార్యదర్శి మగ్బుల్‌బాషా, మడగలం ప్రసాద్, వెంకటేశ్ పాల్గొన్నారు.



ఆర్టిస్ట్ రఘుకు నివాళులర్పిస్తున్న రవిశంకర్‌రెడ్డి

గణిత ప్రతిభా పరీక్షకు అనూహ్య స్పందన

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 11: చాపాటి గంగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ తరపున నిర్వహించిన గణిత ప్రతిభ పరీక్షకు అనూహ్యస్పందన లభించింది.ఆదివారం స్థానిక సత్రం పాఠశాలలో 8,9,10వ తరగతుల విద్యార్థులకు నిర్వహించిన ఈ పరీక్షకు 280 మంది హాజరయ్యారు. పట్టణ ఎస్ఐ అరుణ్‌రెడ్డి, ఎంఈఓ ఎస్.రామానాయుడు, ప్రదానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ముగిసిన రామాయణ పఠనం

సింహాద్రిపురం, ఫిబ్రవరి 11: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని మండలంలోని భానుకోట శైవ క్షేత్రంలో గత 21 రోజులుగా నిర్వహిస్తున్న రామాయణ పఠనం ఆదివారంతో ముగిసినట్లు భాగవత భక్త సమాజ మండలి కో ఆర్డినేటర్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణ పఠనం ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్విఘ్నంగా విజయవంతం చేసిన గ్రామ పెద్దలకు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ముగింపులో 108 సార్లు శ్రీరామ నామ జపాలను నిర్వహించారు. కార్యక్రమంలో శివయ్యస్వామి, కనకయ్య స్వామి, శ్రీనాథ్‌రెడ్డి, రామకోటి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

వల్లూరు, ఫిబ్రవరి 11 : మండల కేంద్రమైన వల్లూరులో గణేష్‌పురంలో ఏర్పాటు చేసిన శ్రీవెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్యశిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరంలో ఉచితంగా బీపీ, షుగరు వ్యాధి, చిన్న పిల్లలకు సంబంధించిన డాక్టర్లు, ట్రస్టు సభ్యులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. ఈ శిబిరంనందు డాక్టర్ నరేంద్రరెడ్డి, చిన్న పిల్లల వైద్యులు సునీల్ షుగరు వ్యాధినిపుణుల ఈఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు ఛారిటబుల్‌ట్రస్టు చైర్మన్ ఈశ్వరరెడ్డి తెలిపారు. 140 మందికి పైగా ఈ శిబిరం నందు పాల్గొన్నట్లు ప్రతి ఒక్కరికీ బీపీ,షుగరు టెస్టులు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు, రమణారెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, లక్షుమయ్య పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో చికిత్స చేస్తున్న డాక్టర్లు

'పెద్దిరెడ్డీ... హుందాతనంగా రాజకీయం చేయడం నేర్చుకో'

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 11 : పుంగనూరులో తమ అధినేత బోడే రామచంద్రయ్యయాదవ్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజకీయంగా ఎదుర్కోలేక పోలీసులను అడ్డుపెట్టుకుని రాంచంద్రయ్యయాదవ్ మీద చూపుతున్న నీచపు కుట్ర అని బీసీవై రాష్ట్ర సమన్వయ సారధి డేవిడ్ అన్నారు. ప్రజలపక్షాన ఉన్న రామచంద్రయ్య యాదవ్ మీద చూపిస్తున్న నీచ కుట్ర, నీ ఆలోచనలతో గోడ గడియారాలు తెచ్చిన బాక్సుల్లో అక్రమంగా మద్యం పెట్టి కర్ణాటక తరలిస్తున్నట్లు కేసులు పెట్టడం పిరికిపంద చర్యగా భావిస్తున్నామన్నారు. ఇంత పిరికివాడివి నీకెందుకు రాజకీయాలు అని ప్రశ్నించారు. అక్రమాలపై బీసీవై పార్టీ న్యాయపోరాటానికి సిద్ధమన్నారు. 2024 ఎన్నికలకు పుంగనూరు నుంచి బీసీవై పార్టీ శ్రీకారం చుడుతుందన్నారు.

కార్యదీక్షాపరుడు డాక్టర్ నాగుల అంకన్న

కడప(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 11: డాక్టర్ నాగుల అంకన్న కార్యదీక్షాపరుడని రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రొఫెసరు మూల మల్లిఖార్జునరెడ్డి పేర్కొన్నారు. కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయానికి నూతన రిజిస్ట్రారుగా నియమితులైన వైవీయూ ఆంగ్ల శాఖ అసిస్టెంట్ ప్రొఫెసరు డాక్టర్ నాగుల అంకన్నను రచయితల సంఘం ఘనంగా సత్కరించిం ది. పాతబస్టాండు సమీపంలోని రచయితల సంఘం కార్యాలయంలో అంకన్నకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మూల మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ అసిస్టెంటు ప్రొఫెసరుగా వైవీయూలో ప్రవేశించి అసోసియేట్ ప్రొఫెసరుగా ఎదిగిన డాక్టర్ అంకన్న విశ్వవిద్యాలయంలో వసతిగృహ సంక్షేమ అధికారిగా కాంపిటీటివ్ సెల్ డైరెక్టరుగా, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ సభ్యుడిగా వివిధ హోదాల్లో విధులను నిర్వర్తించి విజయవంతంగా పూర్తి చేశారన్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రారుగా సుపరిపాలన అందించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం గౌరవ అధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు, వైవీయూ జర్నలిజం శాఖ అధ్యాపకుడు డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు మాట్లాడారు. అనంతరం చింతకుంట శివారెడ్డి, భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, నీలవేణి మాట్లాడారు.



డాక్టర్ నాగుల అంకన్నను సత్కరిస్తున్న రచయితల సంఘం ప్రతినిధులు

ఇండియా కూటమిని గెలిపించండి: సీపీఐ

కడప(సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 11: దేశంలో బీజేపీ పొరపాటున మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ఉండదని, రాచరిక వ్యవస్థ మొదలవుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య అన్నా రు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆ యన మాట్లాడారు. అవినీతి లేకుండా చేస్తానని, విదేశాల్లో దాగిన నల్ల ధనం వెలికి తీసుకువస్తానని, ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి మోదీ ప్రభుత్వం పదేళ్లకాలంలో చేసిందేమీ లేదన్నారు. మన పాలకులు రాష్ట్ర ప్రయోజనాలు ఢిల్లీలో తాకట్టు పెట్టారన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో ఉన్న ఏ ఒక్కటీ పూర్తిగా అమలు చేయకపోయినా సీఎం కానీ ప్రతిపక్ష నేత కానీ నోరు మెదపలేదన్నారు. అంతేకాకుండా ఎన్‌డీఏ కూటమిలో లేకపోయినా రైతు చట్టాలకు, కార్మిక చట్టాలకు అనుకూలంగా పార్లమెంటు సభ్యులు సిగ్గు లే కుండా ఓటు వేశారన్నారు. దేశ ప్రయోజనాల కో సం ఇండియా కూటమి గెలిపించాలని ప్రజలను కోరారు. సీపీఐ జిల్లాకార్యదర్శి గాలి చంద్ర,జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటశివ, సుబ్రమణ్యం, గంగాసురేష్ పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యం

● ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 11:విద్యార్థులుకష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప నగరం అక్కాయపల్లె సాయిబాబా పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే 30రోజులను ఒక ప్రణాళిక ప్రకారం కష్టపడి మంచి విజయాలు సాధించాలన్నారు. అలాగే తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస ప్రేరకులు పోకల సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉండి వత్తిడిని జయిస్తే విజయం సాధిస్తారన్నారు. దాదాపు 30 రోజులు పరీక్షలకు సమయం ఉందని, ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకున్న వారే చక్కని ఫలితాలు సాధిస్తారన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదవాలని సూచించారు. పాఠశాల వైస్‌చైర్మన్ సాయిసుధీర్‌కుమారరెడ్డి, కార్పొరేటరు ఎంవీ శ్రీదేవి మాట్లాడుతూ సమయాన్ని ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

'వైసీపీలో బలిజల అణచివేతను తిప్పికొడదాం'

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 11:వైసీపీలో బలిజల అణచివేతను తిప్పికొడదామని బలిజ సంఘం జిల్లా నాయకులు హెచ్చరించారు. పది జిల్లాల్లో బలిజలను సంఘటితం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం కడప నగరం హరిటవర్స్‌లో జిల్లా బలిజ సంఘం నేతలు విలేకరుల సమావేశంలో మా ట్లాడుతూ కడప ఉమ్మడి జిల్లాలో వైసీపీ ఒక్క సీటు కూడా బలిజలకు ఇవ్వలేదని, టీడీపీ రాజంపేట ఎంపీ అభ్యర్థిగా సుగవాసి సుబ్రమణ్యంకు కేటాయించారన్నారు. బలిజలందరూ సమేకమై సుబ్రమణ్యంను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులుకు మొండిచేయి చూపిన జగన్ రాజ్యసభ సీటు ఇస్తామని నమ్మించి మోసం చేశారన్నారు. వైసీపీలో బలిజల అణచివేత ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నామని రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఒక్క సీటు కూడా బలిజలకు ఇవ్వకుండా మొండి చేయి చూపిన జగన్ ప్రభుత్వాన్ని గద్దెదింపాలన్నారు. బలిజ సంఘం రాష్ట్ర నాయకులు హరిప్రసాద్, నాగరాజు, నాయకులు కుప్పాల వెంకటసుబ్బయ్య, ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ము నెయ్య, రామచంద్రయ్య, వేమన, శ్రీనివాస్, బండారు జగన్నాధరావు, భరత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బలిజ సంఘం ప్రతినిధులు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీజేపీ విస్తృత ప్రచారం

చెన్నూరు. ఫిబ్రవరి 11 : రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ ప థకాలపై బీజేపీ నేతలు ఆదివారం విస్తృత ప్రచారం చేపట్టారు. మం డలంలోని శేషయ్యగారిపల్లెలో ఇం టింటా తిరుగుతూ కేంద్రం అమలు చేస్తున్న పలురకాల పథకాల గురించి వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం అందించిన పథకాలను తమవేనంటూ ప్రచారం చేసుకోవడం దారుణమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మాదినేని రామసుబ్బయ్య అన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో ఇచ్చిన టీకాలు, ఉజ్వల కింద ఇచ్చే సిలిండర్లు పెన్షన్లు, అంగన్వాడీ కేంద్రాలు, ఉచిత బియ్యం, ఇలా రకరకాలన్నీ కేంద్రంవేనని ఆయన ప్రజలకు వివరించారు. కావున రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాల్లో ఎక్కువ శాతం కేంద్రానివేనని ఈ విషయాన్ని తెలుసుకోవాలన్నారు. స్టేట్ కౌన్సిల్ సభ్యుడు రవికుమార్, మాజీ మండల శాఖ అధ్యక్షుడు రెడ్డిప్రసాద్, అంజి పాల్గొన్నారు.




శేషయ్యగారిపల్లెలో బీజేపీ పథకాలను వివరిస్తున్న పార్టీ నాయకులు

బంద్‌ను విజయవంతం చేయాలి

● అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ


కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 11: సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న నిర్వహించనున్న గ్రామీణ బం ద్‌ను విజయవంతం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గతంలో 43 రోజులుగా సమ్మె కాలం చేపట్టిన న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 16న అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం నాలుగు డిమాండ్లకు మాత్రమే సమ్మతి తెలిపిందన్నారు. మిగతా డిమాండ్ల సాధన కోసం 16న జరగబోయే బం ద్‌లో పాల్గొనాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌జిల్లాఅధ్యక్ష ప్రధాన కర్యాదర్శి లక్ష్మీదేవి, ప్రాజెక్టు కార్యదర్శి అంజలీదేవిలు, అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంగన్వాడీ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ఘనంగా ఘంటసాల వర్ధంతి వేడుకలు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 11 : గాన గంధర్వుడు ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా శ్రీరాగ రంజని ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఘంటసాల విగ్రహం వద్ద వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాగరంజని ఆర్కెస్ట్రా నిర్వాహకులు, గాయకులు మచ్చ నరసింహాచార్య సారధ్యంలోతొలుత ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



ఘంటసాల విగ్రహానికి పూలమాల వేస్తున్న నరసింహ ఆచార్య

ఘంటసాలకు నివాళి



ఘంటసాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

బద్వేలు, ఫిబ్రవరి 11: పద్మశ్రీ ఘంటసాల వర్ధంతి సందర్భంగా సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కార్యాలయంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ అమర గాయకుడు ఘంటసాల చిరస్మరణీయుడని,అరుదైన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎస్ఎస్.దావూద్, రూపరాజు, ఉమామహేశ్వరరావు, గానుగపెంట నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ



ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 11 : రామేశ్వరంలోని పద్మశాలీయ హిందూ స్మృతి వనానికి తొగటవీరక్షత్రియ ఉద్యోగులు, వృత్తినిపుణుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫ్రీజర్ బాక్స్‌ను అందించారు. రిటైర్డు ఫోర్‌మెన్ పల్లా వెంకటేశేషయ్య తన భార్య పల్లా రామక్కి, కుమారుడు రత్నమయ్యల జ్ఞాపకార్థం తొగటవీరక్షత్రియ ఉద్యోగుల, వృత్తి నిపుణుల సంక్షేమ సంఘానికి ఫ్రీజర్ బాక్స్‌ను అందించారు. ఆదివారం పద్మశాలీయ హిందూ స్మృతి వనం అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్యకు బాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో తొగటవీరక్షత్రియ ఉద్యోగులు, వృత్తినిపుణుల సంక్షేమ, సేవా సంఘం అధ్యక్షుడు ఈడెం లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పల్లా వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్సు పోటీలకు బెడుదూరు విద్యార్థిని ఎంపిక



గౌతమి

కొండాపురం, ఫిబ్రవరి 11 :మండలంలోని బెడుదూరు గ్రామంలోని మండల ప్రాథమికోన్నత పాఠశాలలో 8వతరగతి చదువుతున్న రామలింగాయపల్లి గౌతమి అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి సైన్సు పోటీలకు ఎంపికయ్యారు.శని, ఆదివారాలలో బద్వేల్‌లో జరిగిన ఇన్‌స్పైర్ మానక్ సైన్స్ ప్రదర్శనలో జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సైన్సు టీచర్లు తిరుపాలు, సుబ్బరత్నమ్మ పర్యవేక్షణలో ఈ విద్యార్థిని తయారు చేసిన పర్యావరణ అనుకూల స్ట్రాల తయారీ అనే ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థిని ఎంఈవోలు ఓబులేసు,రామయ్య,ఉపాధ్యాయులు అభినందించారు.

వివాహ వేడుకల్లో ప్రముఖులు



వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌రెడ్డి తదితరులు

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 11 : టీడీపీ సీనియర్ నాయకుడు కురుగుంట్ల నరసింహనాయుడు సోదరుడు రామ్మూర్తినాయుడు కుమారుడు మధుసూదన్‌నాయుడు, వినీత వివాహ వేడుకలు ఆదివారం స్థానిక మైదుకూరు రోడ్డులోని ఆర్ఆర్ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగాయి. వివాహ వేడుకల్లో వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగుంట్లరామక్రిష్ణనాయుడు, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నాయకుడు రితీష్‌రెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, అలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బొజ్జ రోశన్న, సుధాకర్‌నాయుడు, కనుమర్లపూడి ప్రసాద్, మస్తాన్‌బాబు, పసుపులేటి రమణయ్య, సాధనకారి రంతు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ధర్నాకు దూరంగా ఉండాలంటూ నోటీసులు

బద్వేలు, ఫిబ్రవరి 11: యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో విజయవాడలో సోమవారం జరగబోయే ధర్నాకు హాజరు కారాదని సీఐటీయూ నాయకులు, విద్యుత్ కార్మికులకు ఆదివారం పోలీసులు నోటీసులు అందించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యుత్, కాంట్రాక్ట్ కార్మికులకు ఎన్నికలకు ముందు జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా తాజా పీఆర్సీ ప్రకారం వేతనాలు కూడా పెంచడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఎన్ని ఆటంకాలు తలెత్తినా విజయవాడ ధర్నా చౌక్ వద్ద వేలాదిమందితో కాంట్రాక్ట్ కార్మికులు తమ నిరసన తెలియజేస్తారని తెలిపారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

- అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 11: సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న నిర్వహించనున్న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. ఆదివా రం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గతంలో 43 రోజులుగా సమ్మె కాలం చేపట్టిన న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 16న అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం నాలుగు డిమాండ్లకు మాత్రమే సమ్మతి తెలిపిందన్నారు. మిగతా డిమాండ్ల సాధన కోసం 16న జరగబోయే బంద్‌లో పాల్గొనాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌జిల్లాఅధ్యక్ష ప్రధాన కర్యాదర్శి లక్ష్మీదేవి, ప్రాజెక్టు కార్యదర్శి అంజలీదేవిలు, అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు.

కార్యకర్తలు మనోధైర్యంతో మెలగాలి

చక్రాయపేట, ఫిబ్రవరి 11: టీడీపీ కార్యకర్తలు మనోధైర్యంతో మెలగాలని రానున్నది మంచిరోజులని మాజీ ఎమ్మెల్సీ బీటెక్‌రవి పేర్కొన్నారు. ఆదివారం మం డలంలోని సురభి గ్రామం బాలతిమ్మయ్యగారిపల్లెకు చెందిన టీడీపీ మండల యువనాయకులు తొడలమలదిన్నె అమర్‌నాథ్ నూతన గృహ ప్రవేశానికి బీటెక్ రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డికి, బీటెక్ రవికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ వచ్చేవి మంచి రోజులని ధైర్యంగా ఉండాలని సూచించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం





ప్రొద్దుటూరులో వజ్రపు కిరీట ధారణలో వాసవీమాత, 102 బుట్టల పూలతో చిన్నారులు.





మైదుకూరులో అమ్మవారి వేషధారణలో ఉన్న ఆర్య వైశ్య కన్యకలు, బద్వేలులో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 11 : వాసవి కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, సుగంధ, పూజా ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. లోకకల్యాణార్థం వేద పండితులు గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విరాట్‌ను వజ్రపు కిరీటం, పూలమాలతో అలంకరించారు. సాయంత్రం 102 మంది ఆర్యవైశ్య చిన్నారులు 102 రంగు రంగు పూల గంపలతో ఊరేగించి అమ్మవారికి పుష్పాభిషేకం చేశారు. 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు సామూహికంగా లక్ష కుంకుమార్చన చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, దీపాలతో అర్చించి కర్పూర హారతి ఇచ్చారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరు పట్టణంలోని అమ్మవారిశాలలో ఆదివారం వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలను ఆర్యవైశ్యులు ఘనంగా జరుపుకొన్నారు.వేకువజామునుంచే అమ్మవారికి పూజలు మొదలై రాత్రి మంగళహారతితో ముగించే వరకు అన్ని కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.వాసవీమాత అలంకారంలో ఆర్యవైశ్య కన్యకలు దుస్తులు ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. తదనంతరం అమ్మవారిశాల ముంగిట తీసిన అగ్నిగుండంలో పలు మార్లు తిరిగి తమ భక్తిని చాటుకొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు సూరిశెట్టిప్రసాద్‌తో పాటు పలువురి పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

బద్వేలు..: పట్టణంలోని అమ్మవారిశాలలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు భక్తి, శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కలసపాడు..: మండలంలోని కలసపాడులో ఆదివారం కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజామునే 5గంటలకు గ్రామంలో నగర సంకీర్తన చేశారు. ఆర్యవైశ్యులందరూ ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గణపతి పూజ, నగరేశ్వరస్వామి, వాసవీమాతకు అభిషేకాలు, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. సాయంత్రం 7.30కు ఆర్యవైశ్య మహిళలచే కుంకుమార్చన, పూజలు, భజన, గుడి ఉత్సవం పవళింపు సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు మలిపెద్దు నాగరాజ, మహిళా మండలి అధ్యక్షురాలు టి.సత్యవతమ్మ, సంఘం ప్రధానకార్యదర్శి నారాయణ, యువజ న సంఘం అధ్యక్షుడు కామిశెట్టి జయక్రిష్ణ పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపుదాం..

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు





ఖాజీపేట, జమ్మలమడుగులో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్, భూపేశ్‌రెడ్డి

ఖాజీపేట, ఫిబ్రవరి 11 : వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు రోజులు దగ్గర పడ్డాయిని మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు.మండల పరిధిలోని ఆదివారం ఆంజనేయకొట్టాలు పంచాయతీలోని పుల్లూరు ఎస్టీ,ఎస్సీ కాలనీలలో పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో 60 కుటుంబాలు టీడీపీలో చేరాయి .ఈ సందర్భంగా బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్ళి చంద్రబాబు చేపట్టబోయే పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో శీలం చెన్నయ్య, మీసాల శివశంకర్,మీసాల నాగరాజు,శివ,పెద్దరామయ్య, సుబ్బ రాయుడు, బాబ్జి, రామ్మోహన్,బలరాం, జనసేన మైదుకూరు ఇన్‌చార్జ్ మల్హోత్ర, భాస్కర్‌రెడ్డి,సర్పంచ్ వెంకటసుబ్బయ్య, పిచ్చినా యుడు,సుబ్బయ్య, ప్రతాప్‌రెడ్డి, నాగశివారెడ్డి, రమణ, రామసుబ్బారెడ్డి ,జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు మండలంలోని పి.బొమ్మేపల్లి గ్రామ పంచాయతీలోని బొమ్మేపల్లి, ఒంటిమిట్ట, బీఆర్ కొట్టాల గ్రామాలలో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి పర్యటించారు.ఆదివారం సాయంత్రం పలువురికి టీడీపీ కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు ముద్ర రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, శివరాంరెడ్డి, జగన్, రఘురాంరెడ్డి, ఎల్లారెడ్డి, పద్మనాభరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మధు, చిన్న, సుబ్బరాయుడు, గోపాల్, రామ్మోహన్, బాను ప్రసాద్ తదితరులు చేరారు.

బద్వేలు టౌన్..: మున్సిపాలిటీ పరిధిలోని రఘునాథపురం గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలోకి 20 కుటుంబాల వారు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలకు ఆకర్శితులై వైసీపీ నుంచి గుజ్జు ఓబయ్య, ఓబులదాస్, శ్రీనివాసులు, శివానంద, రవి, విజయ్, సిద్దయ్య, శ్రీనివాసులు, వెంకటయ్య, మోహన్ తదితర కుటుంబాలు టీడీపీలో చేరాయన్నారు. రాబోవు ఎన్నికల్లో సైకో ప్రభుత్వం వైసీపీని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివయ్యస్వామి, వెంగల్‌రెడ్డి, నరసింహనాయుడు, బయన్న, రవి, నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, చెన్నయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



బద్వేలులో విజయమ్మ ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న దృశ్యం

14న సరస్వతీదేవి ఆలయంలో అక్షరాభ్యాసం

కొండాపురం, ఫిబ్రవరి 11 :పట్టణంలో పవిత్ర చిత్రావతి నదీ తీరాన వెలసిన సరస్వతీదేవి ఆలయంలో ఈ నెల 14న బుధవారం అక్షరాభ్యాసం నిర్వహించనున్నారు.వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు నారాయణస్వామి తెలిపారు.గండికోట బ్యాక్ వాటర్ ఆలయంలోకి చేరడంతో గతంలో పూజలు నిలుపుదల చేశారు.ప్రస్తుతం బ్యాక్‌వాటర్ తగ్గడంతో ఆలయంలో ప్రతిరోజు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.వసంతపంచమి సందర్భంగా అక్షరాభ్యాసంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

14న మల్లేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 11 : పట్టణంలోని పోలీసుస్టేషన్, సబ్‌జైలు ఆవరణలో వెలసిన కనకదుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో దుర్గాదేవి సమేత మల్లేశ్వరస్వామి నూతన బ్రహ్మ సూత్ర శివలింగ ప్రతిష్ఠ ఉత్సవమూర్తుల సంప్రోక్షణ,కుంభాభిషేక మహోత్సవం 14న నిర్వహిస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో విగ్రహ మహోత్సవానికి సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సుబ్బరాజ, చంద్రశేఖర్, నాగభూషణం, అశోక్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ పథకాలు ప్రజలకు వరం

అట్లూరు, ఫిబ్రవరి 11 : మోదీ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు ఒక వరమని బీజేపీ పార్లమెంటరీ జిల్లా కన్వీనరు బొమ్మన సుబ్బరాయుడు అన్నారు. ఆదివారం అట్లూరు గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదీ ప్రవేశపెట్టిన ఉచిత రేషన్ బియ్యం, ఉపాధి హామీపథకం, ఉచిత గ్యాస్ సిలిండర్లు తదితర వాటిని ఇంటింటికీ వివరించారు. ఈ కార్యక్రమంలో అట్లూరు మండల అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరుపాల్, వంశీ, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎస్‌ఈబీ స్టేషన్

జమ్మలమడుగు, ఫిబ్రవరి 11: జమ్మలమడుగు పట్టణంలో ముద్దనూరు రోడ్డులోని ఆర్డీవో కార్యాలయం వెనుకభాగాన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ కార్యాలయం శిథిలావస్థకు చేరినది. ప్రస్తుతం ఎనిమిది నెలల నుంచి నిరుపయోగంగా మార్చారు. ఇక్కడ ఉన్న కార్యాలయం వర్షానికి ఉరుస్తుండడంతో పెంకులు పడుతుండడం వలన సంబంధిత అధికారులు కార్యాలయాన్ని ఖాళీ చేశారు. అప్పటి నుంచి శిథిలావస్థకు చేరింది. అయితే కార్యాలయానికి వెనుకభాగాన అసాంఘికాలకు అడ్డాగా మారింది. సాయంత్రం అయ్యేసరికి దగ్గరలో ఉన్న మద్యం షాపుల నుంచి మద్యం తెచ్చుకుని ఇక్కడే తాగుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. అలాగే మట్కా బీటర్లకు తదితర అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.





శిథిలావస్థలో ఎస్‌ఈబీ స్టేషన్, పక్కన మందుబాబులకు అడ్డాగా ఉన్న ప్రాంతం

సమాజ నిర్మాణంలో పాఠశాల ఎంతో ముఖ్యం



మాట్లాడుతున్న వైష్ణవి ఇంగ్లీషు మీడియం హైస్కూలు కరస్పాండెంట్ రామక్రిష్ణ

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 11 : సమాజ నిర్మాణంలో పాఠశాల ఎంతో ప్రాముఖ్యత కలిగిందని విద్యార్థులు లక్ష్యాలు ఎంచుకుని విద్యనభ్యసించాలని ఎంఈవో రత్నస్వామి, వైష్ణవి ఇంగ్లీషు మీడియం హైస్కూలు ప్రిన్సిపాల్ రామానుజులు, కరస్పాండె ంట్ రామక్రిష్ణ అన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని వైష్ణవి ఇంగ్లీషు మీడియం స్కూలు దశమ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. సమాజం లో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో ఆప్కోస్ డైరెక్టరు కళ్యాణ్ చక్రవర్తి, అగ్నిమాపక కేంద్ర అధికారి నజీర్ అహ్మద్, సినీ నటులు చిట్టిబాబు, సుమన్‌శెట్టి, గీతాసింగ్ హాజరై విద్యార్థులను వార్షికోత్సవానికి విచ్చేసిన వారందరినీ ఎంతో అలరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 11 : చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి, సోదరి హరితరెడ్డి తెలిపారు. ఆదివారం 38వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి టీడీపీ విడుదల చేసిన మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సునీల్ కుమార్, చౌడమ్మ, సుజాత, గంజికుంట ఆంజనేయులు, సుబ్బరాయుడు, పల్లా లక్ష్మీదేవి, పొణ్యం సుబ్బరాయుడు, రాఘవ, శూలం శివప్రసాద్, నరసింహ, మాబాషా, గౌస్ మొహిద్దీన్, సుధాకర్ యాదవ్, ప్రతాప్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: రాబోవు ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తెచ్చి సీఎంగా చంద్రబాబు అధికారం చేపడితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని బొజ్జ అరుణ, మాచుపల్లెలక్ష్మీదేవి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఉబ్బలివారిపల్లె, కొండాపురం తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోరుమామిళ్లమాజీ సర్పంచ్ హబీబున్నీసా, మండల పార్టీ అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్‌రెడ్డి, గాజులపల్లె చంద్రశేఖర్‌రెడ్డి, మల్లన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలసపాడు..: రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే అని బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జ రోశన్న అన్నారు. మండలంలోని కలసపాడు గ్రామంలో ఆదివారం ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తుగ్యారంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు మార్కెట్‌యార్డు మాజీచైర్మన్ ఎస్కే రంతుల్లా, మండలపార్టీఅధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, పట్టాభిరెడ్డి, భద్రయ్య, రామసుబ్బారెడ్డి, మండల యువత అధ్యక్షుడు దుగ్గిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి. జయరాం,పెద్దమౌలాలి, చాంద్‌బాషా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.







ప్రొద్దుటూరు, బద్వేలు, కలసపాడులో ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు